విద్యార్థులకు క్విజ్ పోటీలు

విశాలాంధ్ర - మాకవరపాలెం : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులకు మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి చంద్రకళ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖాధికారి పిఎస్ఎన్ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువులకు మాత్రమే పరిమితం కాకుండా రోజు వారి దినచర్యలో ఆటలను అలవాటు చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయల్లో పుస్తక పఠనం చేయాలని, ఉన్నత మార్గంలో పయనించేందుకు పుస్తకాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో లలిత కళాక్షేత్ర వ్యవస్థాపకులు రంగరాజు, విశ్రాంతి ఉపాధ్యాయులు శేషగిరిరావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మావోలపై కూంబింగ్ నిరంతర ప్రక్రియ : విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి

విశాలాంధ్ర - నర్సీపట్నం రూరల్ : మావోయిస్టుల కదిలికలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టటంతోనే మంగళవారం జరిగిన ఎన్కౌంటర్లో మావోయిస్టు పార్టీ అగ్రవేత మద్వి హిడ్మా , అతని భార్య రాజి తో పాటు అతని అనుచరులు ఎన్కౌంటర్లో మృతి చెందడం జరిగిందని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి పేర్కొన్నారు. నర్సీపట్నం డి.ఎస్.పి కార్యాలయంలో వార్షిక తనిఖీల్లో భాగంగా వివిధ నేర చరిత్రలపై రికార్డులు విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డిఐజి గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ మావోయిస్టులు ఆయుధాలు విడిచి జన స్రవంతిలో కలవడమే శరణ్యమని, మావోయిస్టుల ఏరివేతకు కూంబింగ్ ప్రక్రియ నిరంతరంగా కొన సాగుతుందని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో మావోయిస్టులపై నిఘా అధికంగా ఉండటంతో మావోయిస్టుల ఏఓబి లోకి ప్రవేశిస్తున్నారని తెలియజేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి పంట పూర్తిగా నిర్మూలించడంతో ఒరిస్సా రాష్ట్రం నుండి గంజాయి రవాణా అవుతుందని దీనిపై ఎక్కడికి అక్కడ నిఘా ఉంచడం జరిగిందన్నారు. గంజాయి అక్రమ రవాణా చేసిన ,గంజాయి సేవించిన నేరమేనని అట్టివారిపై కఠినమైన శిక్షలు విధిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. గంజాయిని పూర్తిగా నిర్మూలనపై ప్రజల్లో చైతన్యం కల్పించుటకు అభ్యుదయం సైకిల్ యాత్రను ప్రారంభించామని తెలిపారు. విశాఖ రేంజ్ పరిధిలోని గడిచిన ఏడాదిన్నర కాలంలో 870 గంజాయి కేసుల్లో రెండు వేల ఐదు వందల మందిని అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు . అలాగే విశాఖ రేంజ్ పరిధిలో 95 మందిపై పిఐటిఎన్డిపిఎస్ యాక్ట్ అమలు చేశామని తెలియజేశారు. 61 మంది మీద పీడీ యాక్ట్ నమోదు చేశామని , 1476 మంది మీద సస్పెక్టెడ్ షీట్స్ ఓపెన్ చేయడం జరిగిందన్నారు. అనంతరం గంజాయి అక్రమ రవాణాపై ఆరా తీయాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, డీఎస్పీ శ్రీనివాసరావు, సిఐలు గోవిందరావు, రేవతమ్మ పాల్గొన్నారు.

కొంతలంలో ఉచిత పశువైద్య శిబిరం

విశాలాంధ్ర - రోలుగుంట : రోలుగుంట మండలం కొంతలం గ్రామంలో పశు సంవర్ధక శాఖ, విశాఖ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం, పాడి రైతుల సదస్సు నిర్వహించారు. నోడల్ ఆఫీసర్ సౌజన్య, పశువైద్యాధికారులు నూకేశ్వరరావు, దమయంతి, బాలతేజ, గ్రామ పెద్దల సమక్షంలో శిబిరాన్ని ప్రారంభించారు. స్పెషలిస్ట్ బృందం 48 పశువులకు గర్భకోశ పరీక్షలు, 13 పశువులకు సాధారణ పరీక్షలు చేసి మందులు అందించారు. 42 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. అనంతరం జరిగిన సదస్సులో పశువుల పునరుత్పత్తి, మేతలో మార్పులు, ప్రత్యేక వీర్య నాళికల సాంకేతికత, కణుసుల నిర్మూలన వంటి అంశాలపై అవగాహన కల్పించారు. పాడి రైతులకు 28 మినరల్ మిక్సర్ ప్యాకెట్లు, 11 బలవర్ధక టానిక్లు పంపిణీ చేశారు. జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ అన్నపూర్ణ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో సిబ్బంది, ప్రజాప్రతినిధులు, 47 మంది పాడి రైతులు పాల్గొన్నారు.

టీడీపీ మండల స్థాయి విస్తృత సమావేశం

విశాలాంధ్ర - పాయకరావుపేట : తెలుగుదేశం పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం పాయకరావుపేటలో పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో పార్టీ కమిటీలు త్వరితగతిన పూర్తి చేయాలని చర్చించుకున్నారు. ఈ సమావేశంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు, పార్టీ మండల అధ్యక్షులు చించలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షులు యాళ్ళ వరహాల బాబు, శ్రీరాంపురం పిఎసిఎస్ అధ్యక్షులు చిక్కాల శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి బొంది కాశీ విశ్వనాథ్, పెదిరెడ్డి శ్రీను, మజ్జూరి నారాయణరావు, గూటూరు శ్రీనివాసరావు, పల్లా విలియం కేరి, మల్లపురెడ్డి రమా కుమారి, దేవవరపు ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువలో పోలీస్ సేవలు డిఐజీ గోపీనాథ్ జెట్టి

విశాలాంధ్ర - మాకవరపాలెం : వివిధ సమస్యలపై పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విశాఖ రేంజ్ డిఐజీ గోపీనాథ్ జెట్టి పోలీసులుకు సూచించారు. మంగళవారం మాకవరపాలెం పోలీస్ స్టేషన్ ను అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హాతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి, తగు సూచనలు చేశారు. అనంతరం రికార్డులు తనిఖీ చేసి, పెండింగ్ కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. తరచూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి, ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పోలీసుల బాధ్యత సమాజ సేవకు అనుగుణంగా ఉండాలన్నారు. గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు, గ్రామీణ సీఐ రేవతమ్మ, ఎస్ఐ దామోదర్ పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - పరవాడ : ప్రముఖ బహుళజాతి ఔషధ మరియు బయోటెక్నాలజీ సంస్థ ఫైజర్, శంకర్ ఫౌండేషన్ సహకారంతో పరవాడలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని సీనియర్ అధికారుల సమక్షంలో ఫైజర్ యూనిట్ అధిపతి బి.మురలీధర్ శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ శంకర్ ఫౌండేషన్తో భాగస్వామ్యం కుదుర్చుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు, నాణ్యమైన కంటి సంరక్షణ సేవలను అందించడంలో శంకర్ ఫౌండేషన్ నిబద్ధతను ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని రోగులకు ప్రయోజనం చేకూర్చేందుకు ఈ అనుబంధాన్ని కొనసాగించాలనే ఫైజర్ ఉద్దేశ్యాన్ని ఆయన నొక్కి చెప్పారు. ఈ శిబిరానికి సమీప గ్రామాల నుండి భారీ స్పందన లభించింది. సుమారు 500 మంది పైగా వైద్య సేవలు వినియోగించు కున్నారు. ఫౌండేషన్ వైద్యాధికారులు డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ అపూర్వ, డాక్టర్ పవన్ తదితరులు రోగులకు అవసరమైన కంటి పరీక్షలు నిర్వహించి సలహాలు అందచేశారు. 350 మందికి కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఇంకా కంటి శస్త్రచికిత్సల కోసం 40 మంది రోగులను గుర్తించినట్లు ఆసుపత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు తెలిపారు. వీరికి త్వరలో నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో శాస్త్ర చికిత్సలు చేయనున్నట్లు చెప్పారు. కాగా ఫైజర్ సంస్థ తరుపున చంద్ర (క్వాలిటీ హెడ్), కె.విజయ్ మహాజన్ (ప్రొడక్షన్ హెడ్), శ్రీ రాజేష్ రావూరి (ఫైనాన్స్ హెడ్), అరవింద్ జయరామన్ (ఈహెచ్ఎస్ హెడ్), పి.రమేష్ (బిజినెస్ ఎక్సలెన్స్ హెడ్), శ్రీ సర్జీత్ సింగ్ (టెక్నాలజీ హెడ్), డాక్టర్ ఈశ్వరరావు, వి.రామరాజు (పబ్లిక్ అఫైర్స్) నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ కె. రాధాకృష్ణన్, డీజీఎం వి.రమేష్ కుమార్, సీనియర్ మేనేజర్ ఎన్.అప్పలరాజు, ఉద్యోగులు, పారామెడికల్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరవాడకు చేరిన మాదకద్రవ్యాల వ్యతిరేక సైకిల్

విశాలాంధ్ర - పరవాడ : మాదకద్రవ్యాల వల్ల వచ్చే సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలీస్ శాఖ చేపట్టిన సైకిల్ ర్యాలీ మంగళవారం పరవాడకు చేరింది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మార్గదర్శకత్వంలో పాయకరావుపేట నుండి ఇచ్చాపురం వరకు సాగుతున్న సైకిల్ ర్యాలీ నక్కపల్లి, ఎలమంచిలి మీదుగా కొనసాగి సాయంత్రం పరవాడకు వచ్చింది. ఈ మేరకు సినిమా హాల్ కూడలిలో 25 మందితో కూడిన సైకిల్ ర్యాలీ బృందానికి డిఎస్పి విష్ణు స్వరూప్, పోలీస్ ఇన్స్పెక్టర్ మల్లికార్జునరావు స్వాగతం పలికారు. ఇదే క్రమంలో స్థానిక సంత బయలు వద్ద ర్యాలీ బృందాన్ని వర్తక సంఘ సభ్యులు, స్థానిక ప్రజలు ఈ ర్యాలీ బృందాన్ని ఆహ్వానించి ప్రోత్సహించారు. ఈ ర్యాలీ బృందం ప్రధాన మార్కెట్ ప్రాంతం గుండా సాగుతూ డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించింది. డ్రగ్స్ వద్దు బ్రో.. అనే నినాదాలు చేయించి సమాజం డ్రగ్స్ నుంచి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు భీమరాజు, కళ్యాణ్ రాజు, మహాలక్ష్మి, విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ ర్యాలీ బృందం రాత్రికి బసచేసి బుధవారం ఉదయం ఇక్కడ నుంచి బయలుదేరి లంకెలపాలెంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని ఇన్స్పెక్టర్ మల్లికార్జునరావు తెలిపారు.

సంక్షేమ పథకాలు అమలుపై ప్రజలకు అవగాహన

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట : మండలంలోని చింతపాక గ్రామ పంచాయతీ రెవెన్యూలో మంగళవారం మండల డిప్యూటీ తాసిల్దార్ శ్రీరామ్ మూర్తి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అమలుపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంతింటి కలను నెరవేర్చుకోవడానికి స్థలం లేక ఎదురుచూస్తున్న లబ్ధిదారులందరికీ ప్రభుత్వం మూడు సెంట్లు కేటాయించే అవకాశం ఉన్నందున అర్హత ఉన్న లబ్ధిదారులంతా ఇల్లు నిర్మాణం కొరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గ్రామ టిడిపి పార్టీ అధ్యక్షులు కలిమి శ్రీను మాట్లాడుతూ గత ప్రభుత్వం చేపట్టిన జగనన్న కాలనీ ఇళ్ల స్థలాలు గ్రామానికి దూరంగా అందుబాటులో లేకపోవడం వలన ఇల్లు నిర్మించుకోలేదని కాబట్టి ఓటమి ప్రభుత్వం గ్రామానికి చేరువలో ఉండే విధంగా ఇళ్ల స్థలాలు ఏర్పాటుతోపాటు గత ప్రభుత్వం చేపట్టిన హౌస్ మ్యాపింగ్ వలన అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలకు అర్హత కోల్పోతున్నారని కావున ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టి సారించి మరల హౌస్ మ్యాపింగ్ చేపట్టి ప్రజలకు మేలు జరిగే విధంగా ఆలోచన చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొలజాన శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామానికి మేలు జరిగే విధంగా గ్రామానికి చేరువలో ప్రజలకు ప్రభుత్వమే ఇళ్ల స్థలాలకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ కోటేశ్వరరావు, వీఆర్ఏ శ్రీను, తోపాటు సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - సబ్బవరం : మండల కేంద్రంలోని స్థానిక శాఖ గ్రంథాలయంలో 58వ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం గ్రంథాలయం అధికారి వి.శిరీష ఆధ్వర్యంలో వ్యాసరచన నిర్వహించారు. నాకు నచ్చిన పుస్తకం, స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర అనే అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ విద్యాలయం, మదర్ పబ్లిక్ స్కూల్, బ్రిడ్జ్ బైన్స్, ఆర్కిడ్, హైస్కూలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు సరోజినీ, రత్న,రాజేశ్వరి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

విశాలాంధ్ర - పాయకరావుపేట : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన భగవద్గీత పోటీలను ఆయన ప్రారంభించారు. గ్రంథాలయాల్లో పుస్తకాల రూపంలో ఉన్న విజ్ఞానాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, ఉన్నత శిఖరాలు ఎదగాలని కోరారు. అలాగే జానపద, దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్.వి. రత్నం, యస్.సీతారామయ్య, ఎన్.టి. సీతారామమూర్తి, జగతా శ్రీధర్, వేముల వెంకటేశ్వరరావు, ఇంజరపు సూరి బాబు, ఐ.ఎన్.మూర్తి, ఇంచార్జ్ గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

విశాలాంధ్ర - యలమంచిలి : యలమంచిలి పట్టణంలో మంగళవారం నాడు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా యలమంచిలి శాఖా గ్రంథాలయంలో వివిధ పాఠశాలల లో చదువు తున్నటు వంటి విద్యార్థులకు గ్రంథాలయాధికారి వి.ఆనంద్ అధ్వర్యంలో కళాశాల స్థాయి, మరియు హైస్కూల్ స్థాయి, విద్యార్థులు కు, క్విజ్ పోటీలు, వ్యాసరచన పోటీలు, నిర్వహించామని ఆనందు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - నక్కపల్లి : మండలంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తమ ఆధార్ లో తేడాలుంటే తల్లి దండ్రుల సమక్షంలో ఆధార్ సెంటరుకి వెళ్ళి సరి చేయించుకోవాలని స్థానిక మండల విద్యాశాఖాధికారి 2 రుత్తల నాగన్నదొర మంగళవారం తెలిపారు. స్థానిక బాలురు మరియు గురుకుల పాఠశాల, గొడిచర్ల హైస్కూల్స్ లో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా సోమవారం నుండి ఆధార్ నమోదు సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వి నియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు శ్రద్ధ వహిం తచాలన్నారు. మొత్తం నేటివరకు 70 మందికి ఆధార్ సవరణలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆధార్ డిజిటల్ అసిస్టెంట్ సీ. హెచ్.నవ్యదీప్తి పాల్గొన్నారు.

రబీ డ్రైషోయింగ్ పద్ధతులను రైతులు పాటించాలి

విశాలాంధ్ర - మాడుగుల : అనకాపల్లి జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ అధికారి సిహెచ్.లచ్చన్న ఆధ్వర్యంలో మాడుగుల మండలం పరిధిలో గల వీరనారాయణం గ్రామంలో మండలం పరిధిలో గల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రబీ సీజన్ లో ప్రధానంగా ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యే ప్రధాన పంటలైన అపరాలు, నువ్వులు, కూరగాయల, పంటలలో అంతర పంటలుగా రబీ డ్రై షోయింగ్ విధానాన్ని అవలంబించి, పంటలను సాగు చేసుకోవాలని ఎస్ఎఫ్ఏ నాగమణి తెలిపారు. ఆరు తడి పంటలు అయిన అపరాల పంటలో అంతర పంచ పాండవులు అయిన పంటలుగా కంది, ఆముదం, గోరుచిక్కుడు, అనుములు, సజ్జలతో పాటుగా కట్టెజనము, బొబ్బర్లు, జొన్న, తోటకూర, గోంగూర మొదలైన పంటలను అంతర పంటలుగా వేసుకోవాలన్నారు. రైతులకు అవసరమైన రబీ డ్రై సోయింగ్ విత్తన కిట్స్‌ను క్షేత్రస్థాయిలో సిబ్బంది ద్వారా సిద్ధం చేసి రబీ డ్రై షోయింగ్ పద్ధతిను రైతులతో వెయ్యించడానికి ఒక ఎకరానికి ప్రధాన పంటతో పాటుగా నాలుగు కిలోలు కిట్‌ను రూ.300లకు బి.ఆర్.సి.(బయో ఇన్పుట్ రిసోర్స్ సెంటర్) ద్వారా, ఆర్ఎస్కెలకు అందుబాటులో రైతులకు అందజేయడం జరుగుతుంది. ఒక ఎకరా పొలం లో ప్రధాన పంట 8 కిలోలు మరియు అంతర పంటలుగా నాలుగు కిలోలు మొత్తం 12 కిలోలు రబీ డ్రై సోయింగ్ పద్ధతి లో రైతు లు విత్తనాలు వేసుకోవాలి. తద్వారా రబీ ప్రధాన పంటలతో పాటుగా పంచ పాండవులు గా పిలువబడే కంది, ఆముదం, గోరుచిక్కుడు, అనుములు, సజ్జలు. దీర్ఘకాలిక పంటలుగా మే, జూన్ నెలలు వరకు ఉండటం వలన మరల పియండిఎస్ (ప్రీ మాన్ సూన్ డ్రై సోయింగ్) నవదాన్య సాగు ప్రత్యేకముగా అవసరం తగ్గుతుంది. భూమి 365 రోజులు పలు పంటలతో కప్పబడి ఉంటుంది. తద్వారా రబీ ప్రధాన పంటలతో పాటుగా అదనపు ఆదాయం ను పొందవచ్చును మరియు పంటల వైవిధ్యతను పెంచి భూమిలో కర్బన శాతాన్ని పెంపొందించే దిశగా తీసుకొని వెళ్ళవచ్చునని తెలియ జేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఎస్ఎఫ్ఏ పి.నాగమణి, జీ.శ్రీనివాసరావు, ఆర్.సింహాచలం, ఎఫ్ఎంటిలు, ఐసిఆర్పిలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికి యువత పోవద్దు...జీవితాలు నాశనం చేసుకోవద్దు

ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

విశాలాంధ్ర - మునగపాక : మాదక ద్రవ్యాల జోలికి యువత పోవద్దు...జీవితాలు నాశనం చేసుకోవద్దని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలన కోరుతూ పోలీస్ శాఖ పాయకరావు పేట నుంచి ఇచ్చాపురం వరకు చేపట్టిన సైకిల్ ర్యాలీని మండల కేంద్రమైన మునగపాకలో యలమంచిలి సి.ఐ ధనుంజయరావు, మునగపాక సబ్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ రావు మంగళవారం స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే విజయ్ కుమార్, యలమంచిలి టీడీపీ ఇంచార్జ్, రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరావు మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు.యువతకు దిశా నిర్దేశం చేశారు. మాదక ద్రవ్య రహిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలన్న ప్రభుత్వ సంకల్పానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.యువత జీవితాన్ని డ్రగ్స్ నాశనం చేస్తున్నాయని పేర్కొన్నారు.ఈ సమాజం బాగుండాలంటే డ్రగ్స్ ఉండకూడదని తెలిపారు. మన ఆధీనంలో మనల్ని లేకుండా చేసేదే ఈ మాదక ద్రవ్యాలని వెల్లడించారు.యువత రేపటి భవిష్యత్ అన్నారు. ఆరోగ్యకరమైన భారతదేశం యువత చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. కాగా డ్రగ్స్ వినియోగంపై అవగాహన కలిగించేందుకు వాటి దుష్ప్రభావాల గురించి చాటి చెప్పేందుకు పోలీస్ శాఖ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఎంతో అభినందనీయమని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో యలమంచిలి నియోజకవర్గ టీడీపీ నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, టీడీపీ సీనియర్ నాయకులు దాడి మునిలినాయుడు, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, మండల జనసేన అధ్యక్షులు టెక్కలి పరశురామ్, మునగపాక గ్రామ శాఖ అధ్యక్షులు దాడి శివ, కూటమి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'వక్తృత్వం' పోటీలు

విశాలాంధ్ర - కశింకోట : మండలంలోని, తాళ్ళపాలెం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు భాగంగా విద్యార్థులకు "వక్తృత్వం" పోటీలు జూనియర్, సీనియర్ విభాగాలలో మంగళవారం నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా అంబేద్కర్ గురుకుల పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు వై.ఉదయదేవి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజిక్స్ ఉపాధ్యాయులు జి.హరికృష్ణ, గాయత్రి పాఠశాల సోషల్ ఉపాధ్యాయులు కె.మహాలక్ష్మీనాయుడు పాల్గొన్నారు. ఈ పోటీలలో 43 మంది విద్యార్థులు పాల్గొన్నగా, ఈ కార్యక్రమాలు గ్రంథాలయాధికారి సమక్షంలో నిర్వహించారు. 19న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా పాఠశాల విద్యార్థినులకు "రంగవల్లి", "మ్యూజికల్ చైర్" పోటీలు నిర్వహిస్తామని గ్రంథాలయాధికారి కె.జగన్నాథం తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి : ఎంపీడీవో విజయలక్ష్మి

విశాలాంధ్ర - పాయకరావుపేట : గ్రామాల అభివృద్ధికి సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీవో పి.విజయలక్ష్మి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని, శత శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని, పంచాయితీకి ఆదాయం వచ్చే వనరుల వైపు దృష్టి సారించాలని తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వై. సత్యనారాయణ, పలువురు సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీజేపీ సీనియర్ నాయకులు సత్యనారాయణను పరామర్శించిన పి.వి.ఎన్. మాధవ్

విశాలాంధ్ర - సబ్బవరం : మండలంలోని బాటజంగాలపాలెం పంచాయతీ, అజయ్ నగర్ కి చెందిన బిజెపి పార్టీ సీనియర్ నాయకులు వనం సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నం మెడికవర్ హాస్పిటల్లో ఓపెన్ హార్ట్ సర్జరీ చేసి చికిత్స పొందు తున్నాడు. ఆ విషయం తెలుసుకొని బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ మెడికవర్ ఆస్పత్రి కి వెళ్లి సత్యనారాయణ ను పరామర్శించారు. ఈ సందర్భంగా వారి యొక్క ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అలాగే మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గోంప నర్సింగరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రెడ్డి రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలు

విశాలాంధ్ర - చోడవరం : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా చోడవరం శాఖ గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ పాలిత ఇంచార్జి అధికారిణి ఎం.ఎస్.ఎల్.జోగేశ్వరి అధ్యక్షతన నిర్వహిస్తున్న 58వ వారోత్సవల్లో భాగంగా భారత జాతీయ ఉద్యమ కాలంలో ఆంధ్ర ప్రజలను విజ్ఞానవంతులను చేసి రాజకీయ పరిజ్ఞానాన్ని, జాతీయ భావాలను పెంపొందించే విధంగా చేయడంలో నాటి గ్రంథాలయ ఉద్యమం విశేషంగా సాయపడిందని వక్తలు తెలియజేశారు. ఆంధ్రలో జరిగిన ఈ ఉద్యమానికి గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమ రావు, అయ్యదేవర కాళేశ్వరరావు, పాతూరి నాగభూషణం మొదలైన పెద్దలు విశేష కృషి చేశారని వారు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగావారిని స్మరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎం.పి.టి.సి.గూనూరు ప్రభాకర్, కందర్ప సత్యనారాయణ మూర్తి, శ్రీ గణేష్ గాయత్రి బ్రాహ్మణ సేవా ట్రస్టు ఉపాధ్యక్షుడు ఉపాధ్యాయుల శ్రీనివాసరావు, గ్రంథాలయ పాఠకులు, పలు పాఠశాల విద్యార్డులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం

విశాలాంధ్ర - సబ్బవరం : గ్రామాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని పొంద వచ్చునని స్థానిక ఎంపీడీవో పి. పద్మజ అన్నారు. మండలంలోని స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ఎల్ ఎస్ డి జి థీమ్ 5 శిక్షణా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లకు, కార్యదర్శులకు పచ్చదనం పరిశుభ్రత పై శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో చెత్త,చెదారం లేకుండా ప్రతిరోజు పారిశుధ్య కార్మికులు చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని, ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని కోరారు. దీంతో గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని దీనివల్ల ఆరోగ్యవంతకరమైన సమాసం ఏర్పడుతుందన్నారు. ప్రతి ఇంట్లో అందరూ మరుగుదొడ్లు వినియోగించుకోవాలని సూచించారు.చెత్త నుండి సంపద తయారీ చేసుకోవడం వల్ల ఆదాయం పెంచుకోవచ్చని, ఎస్డబ్ల్యుపిసి షెడ్లు మరింత పటిష్టంగా పనిచేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా ఒక స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చిందని, ఆ సంస్థ సిఆర్పి లను నియమించి పంచాయతీలలో చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాలను మరింత అభివృద్ధి చేసి చెత్తను శాస్త్రీయ పద్ధతుల ద్వారా సేకరించి వర్మి కంపోస్టులు తయారు చేయడం జరుగుతుందన్నారు. అంతకుముందు సీనియర్ వైసీపీ నాయకుడు బోకం రాము నాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రత కావాలంటే అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. లేకుంటే గ్రామాల పరిశుభ్రత సాధ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు బోకం రాము నాయుడు, ఎం ఈ ఓ ఎం జె రవీంద్రబాబు, సీనియర్ అసిస్టెంట్ పి.వి పంతులు, పలు గ్రామాల సర్పంచులు,కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వైయస్ జగన్మోహనరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన గండి రవికుమార్

విశాలాంధ్ర- సబ్బవరం : వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు,నవ్యంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రివర్యులు వై.యస్. జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం పెందుర్తి నియోజకవర్గం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గండి రవికుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెందుర్తి నియోజకవర్గం లోని పలు అంశాలపై చర్చించారు.

మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డిని కలిసిన 'బొడ్డేడ'

విశాలాంధ్ర - మునగపాక : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి,అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ మర్యాదగాపూర్వకంగా కలిశారు.

ఎన్టీఆర్ జిల్లా హాస్పిటల్‌ను పరిశీలించిన కొణతాల

సదరం క్యాంపు, రోగులకు అందుతున్న సేవలపై ఆరా

విశాలాంధ్ర - అనకాపల్లి : ఎన్టీఆర్ జిల్లా హాస్పటల్లను మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మంగళవారం పరిశీలించారు. ముందుగా అక్కడ జరుగుతున్న సదరం క్యాంపును సందర్శించి అక్కడికి వచ్చిన వికలాంగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిసిహెచ్ శ్రీనివాసరావుతో మాట్లాడి సదరం క్యాంపు నిర్వహణపై చర్చించారు. పింఛన్ అర్హత ధ్రువీకరణ పత్రం కొరకు దరఖాస్తు చేసుకున్న వికలాంగులకు ప్రతిరోజు 30-40 మంది స్లాట్స్ ఇవ్వడం జరుగుతుందని ముఖ్యంగా ఇప్పుడు ప్రారంభమైన సదరం క్యాంపులో కంటి, ఎముక, మెంటల్లి డిజేబులిటీ సంబంధించి సదరన్ క్యాంప్ నిర్వహించడం కొణతాల తెలిపారు. పెండింగ్లో ఉన్న అప్లికేషన్లు కొత్త అప్లికేషన్లు రిజెక్ట్ ఏవైతే ఉన్నాయో అవన్నీ మళ్ళీ అప్లై చేసుకున్నా, ఇవన్నీ కూడా మూడు వారాల్లో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. అలాగే ప్రభుత్వం నుంచి రావాల్సిన విధంగా ఏదైతే పింఛన్ వస్తుందో వాటికి కావాల్సిన సంబంధిత ప్రభుత్వ ఎలిజిబిలిటీ సర్టిఫికెట్ వెంటనే ఇవ్వాలని ఆలోచనతో ఉందని వెంటనే సద్వినియోగ పరచుకోవాలని అని

కోరారు.హాస్పిటల్ ని వివిధ విభాగాలను సందర్శించి మాట్లాడుతూ. హాస్పిటల్‌ను ఆధునికరణ చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందులో భాగంగా మొదట్లో సిటీ స్కాన్ ఏర్పాటు చేసామని, నెఫ్రాలజీ గా ఎక్కువ మంది ఇబ్బంది పడుతున్న సందర్భంగా డయాలసిస్ యూనిట్లు ఐదు బెడ్లు ఇచ్చారు అలాగే అదనంగా రెండు ఇచ్చారు మళ్లీ ఇప్పుడు మూడు బెడ్లు కు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. అదే కాకుండా నెఫ్రాలజీ కి సంబంధించి వెయిటింగ్ లిస్ట్ ఎక్కువగా ఉండకుండా ఉండే విధంగా త్వరితగతనే వైద్యం అందించే విధంగా ఉండాలని వేరే బ్లాక్ సమకూర్చాలని ఆలోచనతో ఉన్నామన్నారు. అలాగే సిఎస్ఆర్ గ్రాండ్ కింద నవఫర్ కంపెనీ ద్వారా 80 లక్షల రూపాయలతో 3 ఆపరేషన్ థియేటర్ల ఆధునీకరణ చేసే కార్యక్రమం జరుగుతుందన్నారు. నాచురల్ డెలివరీ ఎక్కువ అయ్యేది ఎన్టీఆర్ జిల్లా హాస్పిటల్ కాబట్టి అది గొప్ప విషయంగా భావిస్తూ దానికి సహకరిస్తున్న డాక్టర్లు అందరికీ అభినందనలు తెలియజేశారు. సిఎస్ఎస్ గ్రాంట్ కింద, గైనిక్ సంబంధించి వచ్చిన పేషంట్లకి వెయిటింగ్ హాలు ఉండాలని ఉద్దేశంతో 68 లక్షల రూపాయలతో సంస్థలతో మాట్లాడుతున్నాం అది కార్య రూపం జరుగుతుందని, అలాగే మార్చురీ విషయానికి వస్తే అది పురాతనంగా ఉన్నది, అక్కడ మార్చురీలో డెడ్ బాడీ పెట్టడానికి సరైన సదుపాయాలు లేదు కాబట్టి దాన్ని కూడా సి ఎస్ ఆర్ గ్రాండ్ సుమారు 58 లక్షల రూపాయలతో అది త్వరలోనే ఆధునికరం చేయడానికి ప్రయత్నాలు జరుగుతుందన్నారు. అల్టిమేట్‌గా జిల్లా హాస్పిటల్ 400 బెడ్స్ ఆసుపత్రిగా ఈ ఐదు సంవత్సరాలలో రూపొందించాలని ప్రణాళికతోనే ముందుకు వెళు న్నాము దీనికి సహకరిస్తున్నటువంటి డాక్టర్లకు అదే విధంగా ఎన్టీఆర్ హాస్పిటల్ అడ్వైజరీ కమిటీ క నిత్య పర్యవేక్షణలో ప్రత్యేకంగా అ జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అభివృద్ధి చేయాలన్నటువంటి ఆలోచనతో ఉన్న వారికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

ప్రజా ఉద్యమంగా అభ్యుదయ సైకిల్ యాత్ర

డ్రగ్-ఫ్రీ అనకాపల్లి వైపు మరో దృఢ అడుగు

డీఐజీ గోపినాథ్ జట్టి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : అభ్యుదయ సైకిల్ యాత్ర ప్రజా ఉద్యమంగా మారింది" అని డీఐజీ శ్రీ గోపినాథ్ జట్టి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డ్ వద్ద మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా అభ్యుదయ సైకిల్ ర్యాలీని జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.గత 4 నెలల్లో 20,000 కంటే ఎక్కువ యాంటీ-డ్రగ్స్ కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ అవగాహన ఇంకా పెరగాల్సి ఉందని అన్నారు. గత ఏడాది 2,500 మంది అరెస్టు, 77 మందికి 20 ఏళ్ల జైలు శిక్ష విధించబడిందని వివరించారు. ప్రతి ఇంటికి %-% ప్రతి వ్యక్తికి డ్రగ్ ఫ్రీ సందేశం చేరడమే మా లక్ష్యం అని అన్నారు.సమాజం, పౌరులు, కుటుంబాలు కలిసి పని చేస్తే డ్రగ్ మాఫియాను పూర్తిగా నిర్మూలించగలమని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ కృష్ణన్ మాట్లాడుతూ.డ్రగ్స్ మాత్రమే కాదు, సోషియల్ మీడియా సహా ఏ అలవాటు అయినా అడిక్షన్‌గా మారకూడదని విద్యార్థులను హెచ్చరించారు. "మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది" అని ఆమె పేర్కొన్నారు.ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ గత 1.5 సంవత్సరాల్లో 3,500 స్కూళ్లు/గ్రామాల్లో సంకల్పం కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించామని చెప్పారు.

డ్రగ్స్‌పై సమాచారం ఇవ్వడానికి 112 లేదా 1972 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. సమాచార దాతల వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచబడతాయి" అని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి , ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, డైట్ కాలేజీ చైర్మన్ దాడి రత్నాకర్,అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు, డీఎస్పీలు ఎం.శ్రావణీ, ఈ.శ్రీనివాసులు, ఇన్స్పెక్టర్లు లక్ష్మీ, గఫూర్, ప్రేమ్ కుమార్, వెంకట నారాయణ, అశోక్ కుమార్, స్వామినాయుడు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థలునుంచి భారీగా విద్యార్థులు పాల్గొన్నారు. కాగాడైట్ కాలేజ్ , ఆదిత్య కాలేజ్ విద్యార్థులు ఆకట్టుకునే స్కిట్ ప్రదర్శించి ప్రజల్లో చైతన్యం నింపారు.

భూటాన్ అంతర్జాతీయ పోటీల్లో భారత్‌కు నాలుగు స్వర్ణాలు

విశాలాంధ్ర - రోలుగుంట : భూటాన్‌లో ఈ నెల 14 నుంచి 17 వరకు సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ అథ్లెటిక్స్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రోలుగుంట ప్రభుత్వ పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయిణి, క్రీడాకారిణి పివిఎం నాగజ్యోతి ప్రతిభా ప్రదర్శనతో నాలుగు బంగారు పతకాలు సాధించి దేశానికీ, రాష్ట్రానికీ గౌరవం తీసుకు వచ్చింది. సుమారు 10 దేశాల నుంచి ప్రముఖ క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో నాగజ్యోతి 60 మీటర్ల, 100 మీటర్ల పరుగులు, డిస్కస్ త్రో, పవర్‌లిఫ్టింగ్ విభాగాల్లో స్వర్ణపతకాలు నెగ్గి భారత పతాకాన్ని అంతర్జాతీయ వేదికపై ఎగురవేసింది. పోటీ అనంతరం భూటాన్ ప్రతినిధులు స్వయంగా పతకాలు అందజేస్తూ ఆమె ప్రతిభను ప్రశంసించారు. నాగజ్యోతి ఇప్పటికే నేపాల్, సింగపూర్, మలేషియా వంటి దేశాల్లో జరిగిన అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ మరియు అథ్లెటిక్స్ పోటీల్లో అనేక స్వర్ణాలు సాధించిన క్రీడాకారిణిగా గుర్తింపు పొందింది. తాజా విజయాలు ఆమె క్రీడా జీవితంలో మరొక కీలక అధ్యాయంగా నిలిచాయి. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ వేదికలపై భారత త్రివర్ణ పతాకం మరోసారి ఎగురవేయాలనే సంకల్పాన్ని ఆమె వ్యక్తం చేసింది.

మిషన్ వాత్సల్య పై ప్రతి ఒక్కరు అవగాహనతో ఉండాలి

విశాలాంధ్ర - నర్సీపట్నం : జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య పథకం, బాల్య వివాహాలు అంశంపై ప్రాజెక్టు స్థాయిలో అంగన్వాడి వర్కర్లకు స్థానిక ప్రాజెక్ట్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా నోడల్ అధికారి కోరుకొండ మేరీ సువార్త, డిసిపిఓ రమేష్, పిఓ ఎన్ఐ సి కోఆర్డినేటర్ మనోహర్, ఐసీపీఎస్ స్టాఫ్ రూప, ఎన్జీవో మహాలక్ష్మి తదితరులు హాజరయ్యారు. స్థానిక సిడిపిఓ జివి రమణి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నోడల్ అధికారి మేరి సువార్త మాట్లాడుతూ మిషన్ వాత్సల్య పథకం ద్వారా దంపతులు చట్టబద్ధంగా పిల్లలను దత్తత తీసుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. మిషన్ వాత్సల్య పథకంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలు జరిగినప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని బాల్య వివాహాలు చట్టరీత్య నేరమని దీనిపై ప్రతి గ్రామాల్లోని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఐసిడిఎస్ సిబ్బందిపై ఉందన్నారు. కౌమర దశ పిల్లలకు సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. నిరాశ్రయులకు ఆశ్రయం కలిగించే అవకాశం కూడా ప్రభుత్వం తీసుకుంటుందని దానికి అనుగుణంగా ఎక్కడెక్కడ షెల్టర్లు ఉన్నాయో తెలియ చేయవలసిన బాధ్యత కూడా మనందరిపై ఉందన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ లో, రైల్వే స్టేషన్లో చెత్తబుట్లలో పిల్లలు వదిలేసే వారిని గుర్తించి వారికి పిల్లలు అక్కర్లేకపోతే దగ్గర్లో ఉన్న బాల వికాస్ కేంద్రానికి అప్పగించి వారి సంరక్షణకు అవసరమైన చర్యలు తెలియజేయాలన్నారు. సమావేశంలో సూపర్వైజర్లు, ప్రాజెక్ట్ స్థాయిలో ఉన్న అంగన్వాడి వర్కర్లు,ఐసిడిఎస్ సిబ్బంది, పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో విజ్ఞాన వేదిక

విశాలాంధ్ర - రోలుగుంట : రోలుగుంట శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్స వాల సందర్భంగా మంగళవారం లైబ్రేరియన్ ఎన్.రాజుబాబు ఆధ్వర్యంలో "గ్రంథాలయ ఉద్యమ నాయకులకు నివాళి, గ్రంథాలయాల ప్రయోజనాలు" అనే అంశంపై డిబేట్ పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం శేషగిరిరావు మాట్లాడుతూ.. గ్రంథాలయ ఉద్యమ నాయకుల సేవల వల్లే నేడు గ్రంథాలయాలు అభివృద్ధి చెందాయని, విద్యార్థులు ప్రతి ఆదివారం మరియు ఖాళీ సమయాల్లో గ్రంథాలయాన్ని సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా సిఆర్పి సతీష్ గ్రంథాలయ శాస్త్రవేత్త ఎస్ఆర్ రంగనాథన్ సేవలను ప్రస్తావిస్తూ, పుస్తకాల విభాగీకరణ పాఠకులకు ఎంతో సౌలభ్యం కలిగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఉపాధ్యాయుడు మహేష్, కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయురాలు రేవతి, ఉమాదేవి పాల్గొన్నారు.